

## రిజర్వేషన్ 'పంచాయతీ'

అసెంబ్లీ పోరు ముగిసిన తరుణంలో పంచాయతీ పోరుకు నోటిఫికేషన్ కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. 8లో ▸



## బీజేపీదే కీలక పాత్ర

రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ కీలక పాత్ర పోషించనుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో ▸



## కొత్త ఆశలు

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో సామాన్య ప్రజల్లో కొత్త రేషన్ కార్డుల ఆశలు చిగురిస్తున్నాయి. 9లో ▸

## న్యూస్‌రీల్

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



బీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలో పోలెపల్లి బుచ్చయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడికి బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం కలిగి ఉండటంతో శనివారం బాధితుల ఇంటికి వెళ్లి, రూ.2లక్షల బీమా చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి వచ్చినా తాము అండగా ఉంటామని, కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సర్పంచ్ చంద్రయ్య, మాజీ సర్పంచులు ఆంజనేయులు, వెంకటయ్య, నాయకులు హరికృష్ణ, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### చిలుకూరు బాలాజీ సేవలో తాండూరు ఎమ్మెల్యే



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌తో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మొయినాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ శనివారం కొలువుదీరిన నేపథ్యంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు బీఎంఆర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆంద్రూ, నాయకులు కేబుల్ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి ముదిరాజ్, కృష్ణయాదవ్, అనంతరెడ్డి, శ్రీశైలం, ధన్‌రాజ్, నరేందర్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి, కుమార్, నర్సింహ, రాజు, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### త్రిపుర గవర్నర్‌ను కలిసిన ఇంద్రసేనారెడ్డి



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో పంచాయతీరాజ్ ఏఈ

ఇబ్రహీంపట్నం రూరల్: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఇబ్రహీంపట్నం పంచాయతీ రాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ పరిస్థితులపై చర్చించారు. కొత్త ప్రభుత్వం పాలనాతీరుపై ఆరాతీశారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

### '108'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: ఈఎంఆర్ఐ–108 అంబులెన్స్‌లో పైలెట్‌గా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హయత్‌నగర్‌లోని 108 కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎస్ఎస్సీ ఉత్తీర్ణత, బ్యాడ్జ్ లైసెన్స్ లేదా హెవీ లైసెన్స్‌తో పాటు డ్రైవింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్ 8309924615లో సంప్రదించాలని కోరారు.

## దైవ సాక్షిగా..

తెలంగాణ మూడో శాసనసభ శనివారం కొలువుదీరింది. జిల్లా పరిధిలో కాంగ్రెస్ నుంచి శాసన సభ్యులుగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి(కొడంగల్), గడ్డం ప్రసాద్‌కుమార్(వికారాబాద్), బుయ్యని మనోహర్‌రెడ్డి(తాండూరు ), టి.రామ్మోహన్‌రెడ్డి(పరిగి)లు దైవ సాక్షిగా అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ఏఐఎంఐఎం సీనియర్ శాసన సభ్యుడు, ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. – వికారాబాద్, నెట్‌వర్క్





అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే వరుసగా.. మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్

# ఆర్టీసీ.. ఆమెకు ఫ్రీ..

అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం వాటి అమలుకు శ్రీకారం చుట్టింది. మహాలక్ష్మి పథకంలో భాగమైన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని శనివారం మధ్యాహ్నం 2గంటలకు జిల్లా పరిధిలోని డిపోల్లో అధికారికంగా ప్రారంభించింది. అనంతరం జీరో టికెట్‌పై ప్రయాణం చేసిన అతివలు ఆనందం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



మహిళా ప్రయాణికులు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

### 'మహాలక్ష్మి'కి ఉచిత ప్రయాణం

- హర్షం వ్యక్తంచేసిన మహిళలు
- అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం
- జిల్లాలో 165 పల్లె వెలుగు, 39 ఎక్స్‌ప్రెస్‌లు

### జిల్లాలో డిపోలు, బస్సులు

| డిపో | పల్లె వెలుగు | ఎక్స్‌ప్రెస్ |
|---|---|---|
| తాండూరు | 50 | 14 |
| వికారాబాద్ | 64 | 01 |
| పరిగి | 51 | 24 |

పరిగి/వికారాబాద్ అర్బన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు క్రమంగా శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శనివారం తొలుత 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోగోను ఆవిష్కరించారు. అనంతరం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ.. అట్టహాసంగా ప్రారంభించారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా.. ప్రయాణ సమయంలో అతివలు తప్పనిసరిగా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. బస్సుల్లో ఎక్కువ శాతం మహిళలే ప్రయాణం చేస్తారని, ఉచిత ప్రయాణం ద్వారా వారికి ఎంతో లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే ఉచిత ప్రయాణం అనుమతి ఉందని, త్వరలోనే జీరో టికెట్ అందజేస్తామని వెల్లడించారు.

**తొలి రోజు 4,500 మంది..**

మహిళలకు ఉచిత ప్రయాణం పథకం నేపథ్యంలో మొదటి రోజు జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి డిపోల పరిధిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 4,500 మంది మహిళలు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం.. గ్యారంటీ స్కీముల్లో ఒకటైన ఉచిత ప్రయాణం హామీని నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. దీనితో కూలీ పనులు, చిరు వ్యాపారం, ఉపాధి నిమిత్తం నిత్యం ప్రయాణించే వారికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉచిత ప్రయాణ పథకంలో భాగంగా మూడు డిపోల పరిధిలో సుమారు 150 బస్సులు సేవలు అందించనున్నాయి.

## మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌ల దస్త్రాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా తొలుత రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభించారని వెల్లడించారు. శనివారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని తాండూరు ఆర్టీసీ డిపోలో మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. అనంతరం బస్సులో ప్రయాణికులతో కలిసి స్థానిక డిపో నుంచి ఇందిరాచౌక్ వరకు ఎమ్మెల్యే ప్రయాణించారు. ఆర్టీసీ డీఎం సమత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితాసంపత్, మున్సిపల్ కౌన్సిలర్లు పట్లోళ్ల రత్నమాల, నీరజ, మమత, తాండూరు ఎంపీపీ అనితగౌడ్, బషీరాబాద్ ఎంపీపీ కరుణ, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కందనెల్లి శోభారాణి, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీఎంఎస్ డైరెక్టర్ రవిగౌడ్, పీఏసీఎల్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, కొమ్ము గోపాల్‌రెడ్డి, హబీబ్‌లాల, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### భూ కైలాస్ దర్శనం కోసం



తాండూరు పట్టణంలోని భూకైలాస్ దేవాలయాన్ని దర్శించుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాను. ఉదయం వచ్చే సమయంలో టికెట్ తీసుకున్నాను. దర్శన అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ డిపోకు వచ్చాము. బస్సు ఎక్కగానే మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పారు. దాంతో ఎంతో సంతోషం వేసింది.

– భవ్య, ప్రయాణికురాలు, తాండూరు

### ఎప్పుడూ అనుకోలేదు



ఉచితంగా ప్రయాణం చేస్తానని ఎన్నడూ అనుకోలేదు. ఆర్టీసీ బస్సు ఎక్కితే టికెట్ తప్పకుండా తీసుకోవాలి. తీసుకోకపోతే జరిమానా విధిస్తారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో మొదటి సారి ఉచితంగా ప్రయాణిస్తున్నాను. ఎంతో ఆనందంగా ఉంది.

– గౌరమ్మ, తాండూరు

### అభినందనీయం



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయం. మేము నిత్యం బస్సులోనే ప్రయాణం చేస్తుంటాం. ప్రయాణ చార్జీలు పెరగడంతో సుదూర ప్రాంతాలకు కుటుంబ సమేతంగా వెళ్లాలంటే భయమేసేది. ఇ ప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో ఆ భయం తొలగింది.

– శ్రీలత, ప్రయాణికురాలు, పరిగి

### ధన్యవాదాలు



మేము లింగంపల్లి వెళ్తున్నాము. అందులో భాగంగా శంకర్‌పల్లి బస్సు ఎక్కాము. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉంది. ఈ నిర్ణయంతో మహిళాలోకం హర్షం వ్యక్తంచేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– శ్రీ లక్ష్మి, వికారాబాద్ అర్బన్

## విన్నపాలు వింటారిక!

త్వరలో ఫిర్యాదుల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: కోటిమందికి పైగా ప్రజలకు వివిధ రకాల సేవలందించే బల్దియాలో త్వరలో ప్రజా ఫిర్యాదుల్ని విననున్నారు. వారి విజ్ఞప్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు అధికారులు సిద్ధమవుతున్నారు. జీహెచ్ఎంసీలో ఫిర్యాదుల స్వీకరణకు కాల్‌సెంటర్ ఉన్నప్పటికీ, దాని సేవలపై ప్రజలు సంతృప్తిగా లేరు. కేవలం ఫోన్ ద్వారా సమస్య చెబితే ఆపరేటర్లు నమోదు చేసుకోవడం తప్ప వారి వేదన స్వయంగా అధికారులకు విన్నవించే పరిస్థితి లేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. జీహెచ్ఎంసీలో గతంలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' పేరిట అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే వారు. వారి వేదనల్ని వినేవారు. పరిష్కారం కాకపోతే ప్రజలు మళ్లీ వచ్చేవారు. మూడేళ్ల క్రితం కోవిడ్ కారణంగా ఆ కార్యక్రమాన్ని ఎత్తివేశారు. ప్రజావాణి కార్యక్రమం అమలులో ఉన్న సమయంలోనూ గత పాలకమండలిలో మేయర్ సైతం వారానికోసారి 'ఫోన్–ఇన్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల్ని నేరుగా వినేవారు. పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించేవారు. మేయర్ ఆదేశాలు కావడంతో అధికారులు పరిష్కారంలో జాప్యం చేసేవారు కాదు. కొత్త పాలకమండలి ఏర్పాటయ్యాక అటు ప్రజావాణి లేక, ఇటు ఫోన్–ఇన్ అందుబాటులో లేక ప్రజలు తమ సమస్యల్ని పాలకమండలికి కానీ, అధికారులకు కానీ నేరుగా విన్నవించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా.. ఎన్నికల అనంతరం ప్రజావాణిని పునరుద్ధరించే యోచన ఉందని కొద్దిరోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు.

**'ప్రజాదర్బార్'లో..**

ఎన్నికలు ముగిశాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచే 'ప్రజాదర్బార్'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ స్థాయిలోనే ప్రజల ఫిర్యాదుల్ని పరిష్కరిస్తే జీహెచ్ఎంసీకి సంబంధించిన సమస్యలపై ప్రజాదర్బార్‌లో కొంత తాకిడి తగ్గుతుందనే యోచనలో ఉన్నారు.

## మహిళాభ్యున్నతికి తోడ్పాటు

- ఉచిత ప్రయాణంతో మేలు
- రాజీవ్ ఆరోగ్య శ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం
- ప్రభుత్వ పథకాల అమలుకు పకడ్బందీ చర్యలు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- గ్యారంటీ స్కీంలు ప్రారంభం

వికారాబాద్ అర్బన్: మహిళల అభ్యున్నతికి 'ఉచిత' ప్రయాణం తోడ్పాటునిస్తుందని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటైన 'మహాలక్ష్మి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచుతూ రెండు పథకాలను కలెక్టర్ నారాయణరెడ్డి.. వైద్య ఆరోగ్య, రవాణాశాఖ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య శ్రీ, మహాలక్ష్మి పథకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికార యంత్రాంగం పకడ్బందీగా పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్ జెండర్లకు వయసుతో సంబంధం లేకుండా రాష్ట్ర పరిధిలో ఎక్కడైనా ఉచిత ప్రయాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ పథకం మహిళా సాధికారతకు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

**పేదలకు కార్పొరేట్ వైద్యం**

నిరు పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచిందని కలెక్టర్ నారాయణ రెడ్డి వెల్లడించారు. ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రభుత్వం సూచించిన అన్ని ఆసుపత్రుల్లో తక్షణమే అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద ఒక వెయ్యి 672 రోగాలకు వైద్య సహాయం అందనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వాన్ కుమార్, టీసీహెచ్ఎస్ ప్రదీప్ కుమార్, సీడీఆర్ఎంఓ సుధాకర్ షిండే తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితర అధికారులు ఆర్టీసీ బస్సులో బస్టాండ్ నుంచి కొత్తగాడి వరకు ప్రయాణించారు.



బస్సులో మహిళలకు జీరో టికెట్ అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



క్రీస్తు ప్రధాన శిలువ వద్ద భక్తుల ప్రార్థనలు



మరో శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తజనం

# భక్తజనసంద్రంగా ధారూరు

- మెథడిస్టు జాతరకు భక్తుల తాకిడి
- శిలువ దర్శనం, ప్రార్థనలతో భక్తిపారవశ్యం
- కనువిందు చేస్తున్న కాగ్నానది పరవళ్లు

ధారూరు: మెథడిస్టు క్రిష్టియన్ జాతరకు భక్తుల తాకిడి పెరుగుతోంది. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్నారు. పరిసర ప్రాంత గ్రామాల నుంచి అనేక మంది నడుచుకుంటూ ఉత్సవ ప్రాంగణానికి చేరుకుంటున్నారని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు. శిలువ వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తజనం రావడం అంటే ఆ ఏసు మహిమేనని జాతర కమిటీ కార్యదర్శి దయానంద్, కోషాధికారి స్టీవెన్, రెవరెన్ మార్క్ డీఎస్‌లు తెలిపారు.

**ఆకట్టుకున్న నృత్యం**

చిన్నారుల నృత్యం భక్తులను ఆకట్టుకుంది. శనివారం రైళ్లు, ఆర్టీసీ, బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలు తదితర వాటి ద్వారా దాదాపు 50 వేల మంది భక్తులు వచ్చారని లే లీడర్ గ్యాబ్రియల్ తెలిపారు. ఇదిలా ఉండగా.. గతేడాది జాతర పూర్తయ్యే వరకు భక్తులు ఇక్కడే ఉండగా.. ఈ సారి శిలువ వద్ద ప్రార్థన అనంతరం కొందరు, మరుసటి రోజునే మరి కొందరు వెళ్లిపోవడం కనిపించింది. పక్కనే కాగ్నా నది ప్రవహించడం ద్వారా నీటి సమస్య తలెత్తలేదు. ఇక భక్తజనం హుండీలో కానుకలు సమర్పించుకోవడంతో పాటు, యాచకులకు దానంగా డబ్బులు ఇచ్చారు.

**నేటితో జాతర ముగింపు**

101వ మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు దాదాపు లక్ష వరకు భక్తులు రావచ్చునని నిర్వాహకులు భావిస్తున్నారు. కాగా శనివారం సాయంత్రమే సుమారు 1.50 లక్షల మంది వెళ్లిపోయినట్లు సమాచారం.



బిషప్‌లను ఊరేగిస్తున్న భక్తులు, నిర్వాహకులు

### భక్తి, స్నేహభావం..

ఏసు కృపతోనే 101 సంవత్సరాల నుంచి ఉత్సవం జరుగుతోందని, ఇక్కడికి వచ్చే భక్తుల్లో భక్తి, స్నేహభావం పెంపొందుతుందని నిర్వాహకులు చెప్పారు. జాతర ఇక్కడ ఉండటం, దాని పక్కనుంచే కాగ్నా నది ప్రవహించడం తమ అదృష్టమని వెల్లడించారు. అనంతరం వారు భక్తి గీతాలు ఆలపించి భక్తులను పరవశింపజేశారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం రాత్రి బిషప్ ఎంఏ డ్యానియల్, బిషప్ ఎస్ఎల్ కర్‌కరే, జాతీయ లేలీడర్ ఇమానియల్, జాతర కమిటీ కార్యదర్శి, కోషాధికారి స్టీవెన్‌లను నిర్వాహకులు వేడుక ప్రాంగణంలో ఓపెన్‌టాప్ జీప్‌లో ఊరేగించారు. కార్యక్రమంలో హైదరాబాద్ హెచ్ఆర్సీ లేలీడర్ గ్యాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన గొరెంక శివశంకర్(25) గ్రామస్తులతో శుక్రవారం కలిసి మేడికొండలో బొలేరో వాహనంలో దావత్‌కు వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని రాత్రి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో రాకంచర్ల గ్రామ శివారులో ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. సిమెంట్ ట్యాంకర్ రోడ్డుపై నిలపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతుడి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి




నల్ల రామయ్య (ఫైల్)

తాండూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు గ్రామానికి చెందిన నల్ల రామయ్య(67) కడుపు నొప్పి రావడంతో ఈ నెల 2న స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారు. మరుసటి రోజు ఉదయం నుంచి ఆయన కనపడలేదు. బంధువుల ఇళ్లు, పలు ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ దొరకలేదు. శనివారం తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి శివారులోని వరి చేనులో రామయ్య మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన మామ రామయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్లు కోడలు నల్ల లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# రిజర్వేషన్ 'పంచాయతీ'

**ఎదురు చూస్తున్న ఆశావహులు**

- గ్రామ పోరుకు అధికారుల సన్నద్ధం



మోమిన్‌పేట గ్రామం

మోమిన్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వాతావరణం ఇప్పట్లో తగ్గేలా లేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరుణంలో పంచాయతీ పోరుకు నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందని గ్రామాల్లో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన సందర్భంలో పంచాయతీ ఎన్నికలపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. కానీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ పంచాయతీ రాజ్ నూతన చట్టాన్ని ఏర్పాటు చేసి రెండుసార్లు ఒకే రిజర్వేషన్ ఉంటుందని పేర్కొనడంతో ప్రస్తుత రిజర్వేషన్‌లపై అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. వచ్చే నెల జనవరి 31తో పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియనుంది. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో అవే రిజర్వేషన్ కొనసాగనుందా.. లేక మార్పులు చేస్తారా.. అనే సందేహం నాయకులను వెంటాడుతోంది. ఎక్కడ నలుగురు కలిసిన రిజర్వేషన్‌లపైనే చర్చించుకొంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్‌లు 50 శాతానికి మించకుండ నూతన పంచాయతీరాజ్ చట్టంలో మార్పు చేసింది. దీంతో బీసీ రిజర్వేషన్ కోటా 34శాతం నుంచి 23.81 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. ఎస్టీలకు 5.73, ఎస్సీలకు 20.46 శాతం యథాతథంగా ఉంచింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పల్లెల్లో ఎన్నికల వేడి పుట్టింది. ఇటీవలే రాష్ట్ర ఎన్నికల కమిషన్ బీసీ ఓటరు గణన, జాబితా తయారు చేయడం తదితర పనులు క్షేత్రస్థాయిలో పూర్తి చేసి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం రిజర్వేషన్‌ల మార్గదర్శకాలు విడుదల చేయడమే తరువాయి గ్రామాల్లో ఓట్ల జాతర ప్రారంభం కానుంది.

**గ్రామాల్లో సందడి..**

ప్రభుత్వం ఎన్నికలకు సుముఖత తెలపక ముందే గ్రామాల్లోని ఆయా సామాజిక వర్గాల్లో ఎన్నికల ఊపు మొదలైంది. సుమారు అటు ఇటుగా ఇదే సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఖాయం కావచ్చనే ఊహాగానాలతో ఆశావహులు ఓటరులను మచ్చిగా చేసుకొనే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు మాట్లాడని వారితో సైతం మాటలు కలుపుతున్నారు. నిన్నటి వరకు శాసనసభ ఎన్నికలలో ఎడమొఖం పెడమొఖం పెట్టిన నాయకులు గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పలకరింపులు మొదలు పెట్టారు. ఎలాగైన ఈసారి నెగ్గాలనే ఉత్సుకతతో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

**ఖర్చుల భారం..**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పంచాయతీ పోరును తలపించాయి. డబ్బులు, మద్యాన్ని విచ్చల విడిగా పంచారు. కొంత మంది రిజర్వేషన్‌లలో మార్పులు ఉంటేనే బాగుండునని లేదంటే ఈ ఖర్చులను భరించడం సాధ్యం కాదంటున్నారు.

# రానున్న రోజుల్లో బీజేపీదే కీలక పాత్ర

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- కాంగ్రెస్ బలహీనపడటం ఖాయం
- పార్టీ ఓడిన ఓటింగ్ శాతం పెరిగింది
- ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ కీలక పాత్ర పోషించనుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం బీజేపీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో పార్టీ ఓటమి, ఓటింగ్ శాతంపై సమీక్ష నిర్వహించారు. ఓడిన ఈ ఎన్నికల్లో పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఓటమికి గల కారణాలను జరిగిన లోటుపాట్లను సమావేశంలో చర్చకు తీసుకొచ్చారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అవినీతి ఎక్కువగా జరిగిందని విమర్శించారు. కాళేశ్వరమే అవినీతిలో కూరుకపోయిందని అనుకుంటే ప్రస్తుతం విద్యుత్‌శాఖలో సైతం అవినీతి బయటపడిందన్నారు. రానున్న ఏ ఎన్నికైన సరే ఇక కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ ఉంటుందన్నారు. గోవా రాష్ట్రంలో బీజేపీ పాలన ఎంతో భాగుందని అక్కడ పాలనలో విద్య, వైద్యం అమలు తీరును పరిశీలించేందుకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను గోవాకు తీసుకెళ్తానని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటమి సహజమన్నారు. రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీర్ల నర్సింహ్మా, కిరణ్, సురేశ్, వెంకట్‌రెడ్డి, శర్వలింగం, అశోక్, అభిలాష్, ప్రవీణ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

# జంగమ సమాజం సంఘటితం కావాలి

- రాష్ట్ర కన్వీనర్ అమరలింగస్వామి
- కోస్గిలో వన భోజనాలు



సమావేశంలో పాల్గొన్న జంగమ సమాజ సభ్యులు

కొడంగల్ రూరల్: జంగమ సమాజ సభలు, సమావేశాలను విజయవంతం చేస్తూ ఒకరికొకరు సహకరించుకుంటూ సంఘటితంగా అభివృద్ధి చెందాలని ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ అమరలింగస్వామి, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలోని అనంత శ్రీనివాస్ తోటలో వీరశైవ మహేశ్వర(జంగమ) సమాజం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, మద్దూరు, దౌల్తాబాద్, దామరగిద్ద మండలాల్లోని జంగమ సమాజం సభ్యులు పాల్గొన్నారు. ముందుగా పంచార్యుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో వన భోజన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టమని అన్నారు. సమావేశాల్లో పాల్గొనడం ద్వారా పరిచయాలు పెరుగుతూ సాధకబాధకాలు తెలియజేసుకుంటూ సహకారాలు అందించుకునేలా కృషిచేయాలని అన్నారు. సమాజ సభ్యులకు అనంత శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వినయస్వామి, కోశాధికారి శ్రీశైలం, హంపయ్య స్వామి, శివకుమార్, జగదీష్, ప్రకాష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# 'అనంత' భక్తి

**పద్మనాభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి**

వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు. కార్తీకమాసం కావడంతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. మధ్యాహ్నం తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి అడవిలో వనభోజనాలు చేశారు. దీంతో పరిసర ప్రాంతాలన్నీ కోలాహలంగా మారాయి. - అనంతగిరి



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి



అనంతగిరిలో వన భోజనాలు చేస్తున్న ఓ కుటుంబం

# కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న వీర్లపల్లిశంకర్

- మహాలక్ష్మి పథకంతో మేలు
- ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మిపథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి రామేశ్వరం వరకు బస్సులో ప్రయాణించారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహాలక్ష్మి పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలు ఎక్కడినుంచైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చన్నారు. ఈ పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్రవిశాలశ్రవణ్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రావణి, డీఎం ఉష, ఎంపీపీ ప్రియాంకగౌడ్, రమాదేవి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్లచెన్నయ్య, బాబర్‌అలీఖాన్, యండీ ఇబ్రహీం, మసూద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# జల్సాల కోసం బైక్‌ల చోరీ

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు
- కేసు నమోదు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ రామాంజనేయులు

యాచారం: జల్సాలకు అలవాటు పడి బైక్‌లు చోరీ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గాండ్లగూడెం చెందిన ఉదయ్‌కిరణ్, మంచాల మండల కేంద్రానికి చెందిన శివ, వనస్థలిపురానికి చెందిన వంశీలు ముగ్గురు స్నేహితులు. వీరు ఆయా గ్రామాల్లో రిజిస్టర్ చేయని బైక్‌లను చోరీ చేస్తూ ఆ బైక్‌లను విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సా చేసుకునేవారు. ఆ ముగ్గురు ఇటీవల కాలంలో కందుకూర్ మండల పరిధిలోని ఉట్లపల్లి, సార్లరావులపల్లి, కడ్తాల్‌లో మూడు బైకులు చోరీకి పాల్పడ్డారు. గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు శనివారం ఉదయం మీరాఖాన్‌పేట గ్రామ శివారులో వాహనాల తనిఖీలు చేపడుతున్నా క్రమంలో ఒకే బైకుపై ఉదయ్‌కిరణ్, శివ, వంశీలు వెళ్తున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా అనుమానంతో వారిని విచారించగా అసలు విషయం ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

# హత్యాయత్నం కేసులో విచారణ చేపట్టాలి

- గిరిజన బిడ్డకు న్యాయం జరగకపోతే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- సేవాలాల్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌నాయక్



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: శ్రీనునాయక్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు పూర్తి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని సేవాలాల్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న పథకం ప్రకారమే శ్రీనునాయక్‌పై హత్యాయత్నం చేశారన్నారు. హత్యాయత్నం జరిగి రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులను పట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో రియల్ ఎస్టేట్ మాఫియా ఉందని, దీంతో కొందరిని మాత్రమే పట్టుకుని మిగతా వారిని అరెస్టు చేయకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అసలు నిందితులను తక్షణమే పట్టుకొని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని యెడల 14న గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మణ్‌నాయక్, బాలునాయక్, సరోజాబాయి, సుధీర్, చక్రవర్తి, అరుణ్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ లైన్‌మెన్ ఆత్మహత్య

పహాడీషరీఫ్: కుటుంబ కలహాలతో జల్‌పల్లి వాటర్‌మెన్ ఉరేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..జల్‌పల్లి గ్రామానికి చెందిన జి సుధాకర్(48) స్థానిక మున్సిపాలిటీలో వాటర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలి కాలంలో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేది. మూడు రోజుల క్రితం అతని భార్య ఇద్దరు కుమారులతో కలిసి పురానాపూల్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో అతను మానసిక ఆవేదనకు గురై తాగిన మైకంలో సుధాకర్ శుక్రవారం ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి వారు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చెరువులో దూకి యువకుడి బలవన్మరణం

మీర్‌పేట: వివాహం జరగడం లేదని విసుగు చెందిన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. చంపాపేట హరిజనవాడకు చెందిన చిట్టూరుపల్లి నాగరాజు(28) ఓ న్యాయవాది వద్ద టైపిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వివాహం కాకపోవడంతో కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇదే విషయమై శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయి జిల్లెలగూడ చందన చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివారాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన శ్రీశైలం శనివారం మధ్యాహ్నం యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో ఓ శుభాకార్యానికి హాజరై ఇంటికి తిరుగు ప్రయనమయ్యాడు. ఫంక్షన్ హాల్ ఎదుట సాగర్‌రోడ్డు దాటుతున్న క్రమంలో యాచారం నుంచి మాల్ వైపు వేగంగా వెళ్తున్న దేవరకొండకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలాన్ని బలంగా ఢీకొట్టింది. విషయం గమనించిన స్థానికులు 108లో నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. యాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు

**ఎన్నికల్లో విజయం సాధించిన వీర్లపల్లి శంకర్**

- సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం
- విద్యార్థి దశ నుంచే తనదైన పాత్ర



ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్‌లో రాహుల్‌గాంధీ , రేవంత్‌రెడ్డిలతో అభివాదం చేస్తున్న వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: వ్యవసాయ కుటుంబంలో పుట్టి.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నాడు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి తన రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. కల సాకారం చేసుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. చివరికి అనుకున్నది సాధించాడు. షాద్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ విజయ ప్రస్థానం ఇది.

**వ్యవసాయ కుటుంబంలో జన్మించి..**

నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన రామయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు కాస్లాబాద్ శంకరయ్య. ఈయన 1969, మార్చి 15న జన్మించాడు. తమకున్న కొద్ది పాటి పొలంలో రామయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ శంకరయ్యను చదివించారు. నందిగామలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసిన శంకరయ్య 1988లో షాద్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో బీకాం పూర్తి చేశారు.

**ఊరి పేరే ఇంటి పేరుగా..**

వీర్లపల్లి శంకర్ అసలు పేరు కాస్లాబాద్ శంకరయ్య. స్వగ్రామం వీర్లపల్లి. చిన్నప్పటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆయనను అందరు వీర్లపల్లి శంకర్‌గా పిలుస్తూ వచ్చారు. ఆ పిలుపే వీర్లపల్లిగా మారింది.

**కల సాకారం అయ్యింది ఇలా..**

షాద్‌నగర్ ప్రాంతం కాంగ్రెస్‌కి కంచుకోటలాంటిది. అయితే 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన 16 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 12 సార్లు విజయం సాధించింది. 1985, 1994, 2014, 2018 ఎన్నికల్లో తప్పా మిగిలిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. రజక సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలని, కాంగ్రెస్ గెలువదని కొందరు, శంకర్‌కు టికెట్ ఇస్తే పార్టీని వీడిపోతామని మరికొందరు ఇలా ఎన్నో ఇబ్బందులు పెట్టారు. అయినా ఎక్కడా సహనం కోల్పోకుండా పట్టువదలని విక్రమార్కుడిలా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. షాద్‌నగర్ మీదుగా రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో పాటు పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేసి ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. వీర్లపల్లి శంకర్ చేస్తున్న పోరాటానికి మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తోడయ్యాడు. బీఆర్ఎస్ నుంచి చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తన అనుచరగణంతో సొంతగూటికి చేరుకోవడంతో షాద్‌నగర్‌లో కాంగ్రెస్ బలోపేతం అయ్యింది. వీర్లపల్లి, చౌలపల్లి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలు ఎన్నికల్లో తమదైన వ్యూహాలతో ముందుకు వెళ్లారు. చివరికి అసెంబ్లీ ఎన్నికల్లో విజయ ఢంకా మ్రోగించి షాద్‌నగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేశారు.

**ఇదీ రాజకీయ ప్రస్థానం..**

చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్న శంకరయ్య రాజకీయం వైపు అడుగులు వేశారు. 1992లో వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1995 నుంచి 2002 వరకు వీర్లపల్లి సర్పంచ్‌గా పని చేశారు. 2004 నుంచి 2014 వరకు కొత్తూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పని చేశారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. అనంతరం బీఎస్పీలో చేరి ఆ పార్టీ నుంచి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ క్రమంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరి నియోజకవర్గ బాధ్యతలు చేపట్టారు. 2021 నుంచి పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.